క్లుప్తంగా

బకాయిలు విడుదల చేయాలి



తహసీల్దార్ కు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేటజోన్: ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ కోరింది. శుక్రవారం స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సలీమ్ మియ్యకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వం హయాంలో పెండింగ్‌లో ఉన్న బకాయిల కోసం ప్రతిపక్ష హోదాలో కాంగ్రెస్ అప్పట్లో ధర్నా చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే బాధ్యత విస్మరించిందని విమర్శించారు. సర్కారు చొరవ తీసుకుని వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అభిషేక్, భాను, రాజు, రవి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సంక్షేమానికి కృషి



పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వహీద్‌ఖాన్

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి కృషి చేయాలని మైనార్టీ సెల్ మాజీ వైస్ చైర్మన్ వహీద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మైనార్టీల సమస్యలపై వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించాలని సూచించినట్లు తెలిపారు.

మంత్రి సురేఖను కలిసిన నేతలు



మంత్రి కొండా సురేఖను కలిసిన శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్‌లోని ఆమె నివాసంలో కలిసి పార్టీ అందిస్తున్న పథకాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై చర్చించినట్లు తెలిపారు. అంతకుముందు ఆమెను సన్మానించి, ఎల్లమ్మ దేవాలయ ప్రసాదం అందజేసినట్లు తెలిపారు. శ్రీనివాస్ వెంట సురేశ్ తదితరులున్నారు.

క్యాన్సర్ పట్ల అపోహలు వద్దు



డిగ్రీ కళాశాలలో వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ శైలజ

గజ్వేల్‌రూరల్: క్యాన్సర్ వ్యాధి పట్ల అపోహలు పడవద్దని, ముందు జాగ్రత్తతో పరీక్షలు చేయించుకుంటే దానిని జయించవచ్చని ప్రముఖ వైద్యులు నాగమున్నయ్య, గజ్వేల్ సీపీడీసీ మెంబర్ డాక్టర్ శైలజ పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ కమల క్రిస్టియానా ఆధ్వర్యంలో క్యాన్సర్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ క్యాన్సర్ అంటే గతంలో అపోహలు ఉండేవన్నారు. ఇప్పుడు అలాంటివేవి పెట్టుకోవద్దన్నారు. ముందు జాగ్రత్త చర్యలతో దానిని పూర్తిగా జయించవచ్చన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ కళాశాలలో విద్యార్థుల కోసం రూ. 50వేల విలువైన వాటర్ కూలర్‌ను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీవద్దు

దుబ్బాకటౌన్: మధ్యాహ్న భోజన నాణ్యత విషయంలో రాజీపడరాదని రాయపోల్ ఎంపీఓ శ్రీనివాస్ అన్నారు. రాయపోల్ మండలం వడ్డేపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పాఠశాల పని తీరు, మధ్యాహ్న భోజన పథకం అమలు విధానాన్ని పరిశీలించారు.

మురుగు ఇలా.. ఆడేదెలా?

- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో దుర్గంధం
- పట్టించుకోని అధికారులు



ఇప్పలపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో మురుగు

అక్కన్నపేట(హుస్నాబాద్): 'దేవుడు వరమిచ్చినా...పూజారి కనికరించడు' అన్నట్లు ఉంది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల దుస్థితి. ఈ పాఠశాల అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామ పరిధిలోని ఇప్పలపల్లిలో ఉంది. ఇక్కడ ఒక ఉపాధ్యాయుడు, 10,12 మంది విద్యార్థులున్నారు. అయితే ఆటలాడుకునేందుకు పరికరాలు ఉన్నప్పటికి పాఠశాల ఆవరణలో నిత్యం మురుగు పారుతుందని ఆటలాడలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. సాయంత్రం వేళ ఆటలాడుతూ అందులో తమ పిల్లలు పడిపోతున్నారని వారి తల్లిదండ్రులు అంటున్నారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేయించాల్సిన పంచాయతీ అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని పేర్కొంటున్నారు.

అపరిశుభ్రత ..

సీజన్‌లతో సంబంధం లేకుండా ఇప్పలపల్లిలో అపరిశుభ్రత తాండవిస్తోంది. వీధుల్లో ఉన్న అన్నీ డ్రైనేజీలు నిండి కంపు కంపుకొడుతున్నాయి. డ్రైనేజీల్లో చెత్తాచెదారాలు, పిచ్చిమొక్కలు పెరిగి దర్శనమిస్తున్నాయి. కాలనీలో మురుగు పారుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పల్లెవాసులకు శాపంగా మారింది. దీంతో డ్రైనేజీల్లో దోమలు, ఈగలు వృద్ధి చెంది వీరవిహారం చేస్తున్నాయి. అనారోగ్యం పాలవుతున్నామని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మురుగు నిల్వ ఉండి కంపుకొడుతున్న డ్రైనేజీ

చర్యలు తీసుకుంటాం



రోడ్లపై మురుగు చేరితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. డ్రైనేజీలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. కాలువలు శుభ్రం లేకుంటే కాలనీ వాసులకు వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

–గుగులోతు మోహన్, ఎంపీఓ అక్కన్నపేట

రైతు కుటుంబానికి బీఆర్‌ఎస్ అండ

ఎమ్మెల్యే పల్లా



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాలలో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న మహేందర్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కార్యకర్తలు, మండల నాయకులతో కలిసి ఆయన మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. రైతులు ధైర్యం కోల్పోవద్దని, ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సిద్దప్ప, మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు తలారి కిషన్, బద్దిపడగ కృష్ణారెడ్డి, వంగ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఏ ఒక్కరికీ పైసా ఇవ్వొద్దని, అర్హులైన ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించే బాధ్యత తనదేనని జనగామ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని రేణుక గార్డెన్‌లో పట్టణ కేంద్రంతో పాటు చేర్యాల, కొమురవెల్లి, దూళ్మిట్ట మండలాలకు చెందిన 64 మంది లబ్ధిదారులకు రూ.17 లక్షల 94 వేల 500ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ ఎక్కువగా ఇచ్చామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కొద్ది శాతం మాత్రమే ఇస్తోందన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటి వరకు నీలిమ హాస్పిటల్‌లో ఉచితంగా వైద్యం అందిస్తున్నానన్నారు. ఇకపైనా అందిస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కరుణాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశం, భిక్షపతి, నాయకులు నవీన్‌రెడ్డి, యాదగిరి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

దుబ్బాకటౌన్: రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఒక అవకాశం ఇచ్చి గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. ప్రచారంలో భాగంగా శుక్రవారం దుబ్బాక మండలం ధర్మాజీపేట, తిమ్మాపూర్, హబ్సీపూర్, లచ్చపేట మోడల్ స్కూల్ తదితర పాఠశాలలో పర్యటించి తనకు ఓటేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే మోడల్, కేజీబీవీ పాఠశాలలో నెలకొన్న సమస్యలు, సీపీఎస్ రద్దు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఓటరుగా నమోదు కావాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): త్వరలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా పేరును నమోదు చేసుకోవాలని సిద్దిపేట మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవునూరి రవీందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉచిత ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించి, పట్టభద్రులకు అవగాహన కల్పించారు. రవీందర్ మాట్లాడారు. నవంబర్ 6 వరకు ఓటరుగా తమ పేరును నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. 2021 ముందుగా డిగ్రీ పాసైనా అభ్యర్థులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు

పోలీస్ అధికారులు



కొండపాక: రోడ్డుకు అడ్డంగా ఉన్న కొమ్మలను తొలగింపజేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి

కొండపాక(గజ్వేల్): మానవ తప్పిదాలే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతుందనే విషయాన్ని గుర్తించామని, ఆమేరకు నివారణ చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు తెలిపారు. మండలంలోని దుద్దెడ శివారులో గల టోల్ ప్లాజా వద్ద నుంచి వంటిమామిడి వరకు రాజీవ్ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రదేశాలను శుక్రవారం తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి, సివిల్ ఇన్‌స్పెక్టర్ సైదా, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, గౌరారం ఎస్సై కరుణాకర్, ములుగు ఎస్సై విజయ్ కుమార్, సిద్దిపేట హెచ్‌కేఆర్ డీజీఎం విజయ్ భాస్కర్‌రెడ్డిలతో పాటు వివిధ శాఖ ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఏయే శాఖలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయమై ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముందస్తుగా రోడ్డుపై పడిన గుంతలను పూడ్చివేస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. మలుపుల వద్ద చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కానరాకుండా ఉన్నాయని వెంటనే వాటిని కొట్టి వేయాలన్నారు. వాహనాల తనిఖీల వల్ల ప్రమాదాలకు అడ్డుకట్ట వేసుకోవచ్చన్నారు. వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్‌లో..

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ సహకారంతో రాజీవ్ రహదారి నర్సాపూర్ చౌరస్తా నుంచి రంగీలా దాబా వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్ల పొదలను సిబ్బంది శుక్రవారం తొలగించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

గజ్వేల్‌రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల నిర్వహించిన వాహనాల తనిఖీలో 30 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. వారిని శుక్రవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరు పర్చగా విచారణ అనంతరం 30 మందికి రూ.24వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

స్వచ్ఛత, పచ్చదనం బహుబాగు

- చెత్త విభజన అభినందనీయం
- మున్సిపల్ కమిషనర్‌లు



మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు

సిద్దిపేటజోన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛత, పచ్చదనం చాలా బాగుందని, ఇదే తరహాలో అమలుకు కృషి చేస్తామని రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి అధ్యయనం కోసం వచ్చిన మున్సిపల్ కమిషనర్లు పేర్కొన్నారు. శుక్రవారం షెడ్యూల్‌లో భాగంగా రెండవ రోజు సిద్దిపేట మున్సిపాలిటీని సువార్త (కరీంనగర్ కార్పొరేషన్ అడిషినల్ కమిషనర్), ప్రసన్నరాణి (వరంగల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్), మనోహర్ (ఖానాపూర్), రాజేశ్‌కుమార్(బైంసా), ఖమర్ అహ్మద్ (ఆదిలాబాద్), నాగరాజు (చొప్పదండి), రాజు(నిర్మల్), సమయ్య(హుజురాబాద్), వేణుమాధవ్(కొత్తపల్లి), రాజేశ్వర్ (భూపాలపల్లి) మున్సిపల్ కమిషనర్‌లు సందర్శించారు. అధ్యయన టూర్‌లో భాగంగా సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌తో కలిసి స్థానిక 31 వార్డులో ఇంటింటికి వెళ్లి తడి, పొడి, హానికర చెత్త విభజన, ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియ గురించి ఆరా తీశారు. అనంతరం వార్డులో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అదేవిధంగా ఇరుకోడ్ శివార్లలో ఉన్న స్లాటర్ హౌస్‌ను తిలకించారు. పట్టణంలోని డీఆర్సీ యూనిట్ సందర్శించి, పొడి చెత్త సేకరణ ప్రక్రియ గురించి ఆరా తీశారు. స్వచ్ఛ బడిలో చెత్త ప్రాముఖ్యత, చెత్త ద్వారా వర్మీ కంపోస్టు తయారీ ప్రక్రియ పరిశీలించారు. వారి వెంట మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు సతీశ్, వనిత, మాధవి పాల్గొన్నారు.

లింగాపూర్ గ్రామస్తుల నిరసన

ప్రభుత్వ స్థలంలోనే ధాన్యం కేంద్రం ఏర్పాటుకు డిమాండ్



చదును చేసిన భూమిని చూపుతున్న రైతులు

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వ స్థలంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని శుక్రవారం లింగాపూర్ గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ధూళ్మిట్ట మండలం లింగాపూర్‌లో 2010 సంవత్సరం నుంచి ఉజ్వల గ్రామైక్య సంఘం, 30 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటివరకు ప్రైవేట్ వ్యక్తుల భూములను లీజుకు తీసుకుని ఈ కేంద్రాలను నిర్వహించేవారన్నారు. ఈ సంవత్సరం గ్రామంలోని వీరరాఘవుల కుంట సమీపంలోని ప్రభుత్వ భూమిలో కొనుగోలు కేంద్రం నిర్వహించాలని పంచాయతీ తీర్మానించినట్లు తెలిపారు. గ్రామైక్య సంఘానికి వచ్చిన కమిషన్ డబ్బులను ఈ భూమి చదును చేసేందుకు వినియోగించాలని తెలిపారు. గ్రామంలోని రైతులందరూ కలిసి ప్రభుత్వ భూమిని చదును చేశారన్నారు. అయితే రైతులకు డబ్బులు ఇవ్వకుండా ఐకేపీ మండల అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై కలెక్టర్, పీడీలను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు కీలకం

మాజీ మంత్రి పెద్దిరెడ్డి



మాట్లాడుతున్న ఇనుగాల పెద్దిరెడ్డి

కోహెడ(హుస్నాబాద్): బీజేపీ బలోపేతానికి విరివిగా సభ్యత్వం నమోదు చేయాలని మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ మండల సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. ప్రతీ పోలింగ్ బూత్‌లో వంద సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. మండలవ్యాప్తంగా ఇప్పటివరకు 6,500 సభ్యత్వాలు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఎక్కువ చేసిన వారికి రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఈనెల 30 వరకు లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తంగాళ్లపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు వడ్లకొండ చంద్రానికి పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, లక్కిరెడ్డి తిరుమలరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మ్యాకల రజనీకాంత్‌రెడ్డి, పేర్యాల సాగర్‌రావు, గుగ్గిళ్ల శ్రీనివాస్, తూటి బాపురెడ్డి, రామంచ రాంచంద్రారెడ్డి, బొమ్మగాని శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి లాభాలను పొందాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజాప్రతినిధులు అన్నారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రావాలంటే కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. ఎవరికీ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సౌకర్యాలను కల్పించారన్నారు.

– నెట్‌వర్క్



చిన్నకోడూరు(సిద్దిపేట)లో...



అక్కన్నపేట : కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్ శివయ్య



నంగునూరులో..

సంక్షిప్త వార్తలు

◆ 28న సిద్దిపేటకు మందకృష్ణ మాదిగ

హుస్నాబాద్: ఈనెల 28న సిద్దిపేటలో జరిగే ధర్మయుద్ధ సభ కోసం ఉమ్మడి మెదక్ జిల్లా సన్నాహక సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ హాజరై దిశానిర్దేశం చేస్తారని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్‌మాదిగ శుక్రవారం పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు, నాయకులు పెద్ద ఎత్తున తరలొచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

◆ కంప్యూటర్ బహూకరణ

చిన్నకోడూరు(సిద్దిపేట): సిద్దిపేట సిటిజన్స్ క్లబ్ వారి సహకారంతో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా క్లబ్ బోనాల కక్కయ్య మాట్లాడుతూ మనిషిని ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడేది చదువేనన్నారు. సన్మార్గంలో పయనింపజేసే విద్యను ప్రతీఒక్కరు నేర్చుకున్నప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. దాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా చదివితే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. క్లబ్ సభ్యులు, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ రక్తదానం ప్రాణదానంతో సమానం

గజ్వేల్‌రూరల్: రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మరొకరి ప్రాణాలను కాపాడొచ్చని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వ్యక్తులకు రక్తం ఎంతో అవసరం అన్నారు. ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ భవాని, డాక్టర్ నవ్య, సిబ్బంది సువర్ణ, స్వరూపరాణి, ఉమ, మోహరాజ్, వాసుదేవ్, నాగమణి, శశికళ, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సాగర్, శివ, దేవేందర్‌తో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

◆ సద్వినియోగం చేసుకోవాలి

బెజ్జంకి(సిద్దిపేట): రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్, గుగ్గిల్ల, రేగులపల్లె, చిలాపూర్, పెరుకబండ, గుండారం, తిమ్మాయపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్, ఏపీఎం నర్సయ్య, డైరెక్టర్‌లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

◆ విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11 కేవీ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కంచరీ బజార్, ఎస్‌బీఐ బ్యాంక్, బురుజు ఏరియా, సుభాశ్ రోడ్డు, శుభోదయ పాఠశాల, మార్కెట్ ఏరియా ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నాలుగు రోజుల క్రితం తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో ఐదుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి.. వారికి రూ.8,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

చేర్యాల(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం చేర్యాల పోలీసులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ ఎల్.శ్రీను మాట్లాడుతూ, మహిళల రక్షణ కోసం చేసిన చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా, సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే లాభనష్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలను ఎవరైనా వేధించినా, రోడ్డుపై వెళ్లే సమయంలో అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశ పూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్ 100, షీటీం నంబర్ 8712667434, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట నంబర్ 8712667435లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. వెంటనే ఆయా ప్రాంతాలకు చేరుకొని దుండగులపై చర్యలు తీసుకుంటారన్నారు.

◆ బాలల సంరక్షణ కేంద్రానికి శిశువు



గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(పల్లెపహాడ్) కు చెందిన ఓ నిరుపేద మహిళ ఇటీవల పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఆ శిశువును పోషించలేని పరిస్థితులు నెలకొనడంతో గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించింది. వారు సిద్దిపేట జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులకు తెలపగా.. శుక్రవారం గజ్వేల్ స్టేషన్‌కు చేరుకున్నారు. పసికందుకు వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం గజ్వేల్ సీఐ సైదా వారికి అప్పగించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం అధికారి రాజు, శిశుగృహ మేనేజర్ ఝాన్సీ, సిబ్బంది శ్యామల, చైల్డ్‌లైన్ కేస్ సిబ్బంది కవితలు పాల్గొన్నారు.